# వైభవంగా జయంతోత్సవాలు



యజ్ఞంలో పాల్గొన్న వివిధ ప్రాంతాలకు చెందిన దంపతులు

జహీరాబాద్, జనవరి 2: న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయ జయంతోత్సవాలకు తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. స్వామి వారి 225వ జయంతోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో వేదపండితులు స్వామివారికి అభిషేకం, గణపతి హవనం, శతచండీ హవనం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఝరాసంగం మండలంలోని బర్ధిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవదూత గిరిమహారాజ్ తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల దర్శనాలకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ, హద్నూర్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. దాతలు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్ రేజింతల్, ప్రధాన కార్యదర్శి అల్లాడి నర్సింహులు, ఉపాధ్యక్షుడు నీల రాజేశ్వర్, ఉల్లిగడ్డ బస్వరాజ్, సంయుక్త కార్యదర్శులుగా చిద్రి లక్ష్మణ్, కల్ల చంద్రశేఖర్, కోశాధికారిగా డిగంబర్ పోలా, కార్యనిర్వాహకులు కొబ్బజీ రవికుమార్, సభ్యులు సంగమేశ్వర్, దీపక్‌జోషి, చంద్రశేఖర్, మేనేజర్ కృష్ణ పాల్గొన్నారు.

# 'ఓపెన్' పరీక్షల ఫీజు షెడ్యూలు విడుదల

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 2: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో వచ్చే ఏప్రిల్, మే నెలలో జరిగే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజును ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించాలని డీఈవో వెంకటేశ్వర్లు గురువారం ప్రకటనలో తెలిపారు. గతంలో అడ్మిషన్ పొంది పరీక్షలకు హాజరు కాని వారు, పరీక్షలకు హాజరై ఫెయిల్ అయిన వారు ఈ పరీక్షలు రాసేందుకు అర్హులన్నారు. పదో తరగతికి సంబంధించి ప్రతి థియరీ సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్స్‌కు రూ.100 చెల్లించాలని, ఇంటర్మీడియట్‌కు సంబంధించి ప్రతి థియరీ సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్స్‌కు రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి అపరాద రుసుములేకుండా ఈ నెల 9 నుంచి 22 వరకు, రూ.25 అపరాద రుసుముతో ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు, రూ.50ల అపరాద రుసుముతో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. తత్కాల్ ద్వారా ఫిబ్రవరి 4 నుంచి అదే నెల 6వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉన్నదన్నారు. అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లు ఎక్కువ సంఖ్యలో అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ 80084 03635 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్, డైరీని ఆవిష్కరించిన కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, జనవరి 2: సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని ఎంఐజీలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేటర్ హాజరై క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 241మంది భెల్ రిటైర్డ్ ఉద్యోగులకు ఆసరా పింఛన్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. సీనియన్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజునాయక్, వైకుంఠరావు, రామరావు, వెంకట్‌రెడ్డి, దేవేంద్రాచారి, రాధాకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు రుణాలపై వేగం పెంచాలి



మాట్లాడుతున్న డీపీఎం కొమురయ్య

కల్హేర్, జనవరి 2: కల్హేర్, కంగ్టి, సిర్గాపూర్ మండలాల డ్వాక్రా సంఘాల సభ్యులకు బ్యాంకు రుణాలు ఇప్పించడంలో వేగవంతం చేయాలని డీపీఎం ఫైనాన్స్ కొమురయ్య ఆదేశించారు. గురువారం కల్హేర్, కంగ్టి, సిర్గాపూర్ మండలాల ఏపీఎంలు, సీసీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మహిళా సహాయక సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి అవసరాలకు అనుగుణంగా రుణం ఇప్పించాలన్నారు. మూడు మండలాలు బ్యాంకు రుణాలు ఇప్పించడంలో వెనుకబడి ఉన్నాయన్నారు. స్త్రీ నిధి రుణాలు బకాయి ఉన్నాయని, తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల చివరి వరకు 70శాతం రుణాలు మహిళలకు ఇప్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏపీఎంలు కుమార్, విశ్వనాథం, సిర్గాపూర్, కంగ్టి, కల్హేర్ ఏపీఎంలు అనంతయ్య, కిష్టయ్య, సాయిలు, సీసీలు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన



దేవునూర్‌లో యాసంగి పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ సత్యనారాయణ

వట్‌పల్లి, జనవరి 2: మండల పరిధిలోని దేవునూర్ శివారులో ఏడీఏ సత్యానారయణ క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. యాసంగిలో సాగవుతున్న శనగ, కుసుమ పంటల్లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్ రెడ్డి, ఏఈవో ప్రవీణ్, రైతులు చంద్రరెడ్డి, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.



దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడల సామగ్రిని అందజేస్తున్న ప్రతినిధులు

## క్రీడలపై ఆసక్తి చూపాలి

కోహీర్, జనవరి 2: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపించాలని ఎంఈవో జాకీర్ హుస్సేన్ కోరారు. గురువారం మండలంలోని దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రీన్ కో సంస్థ ఆధ్వర్యంలో రూ.50వేల విలువైన క్రికెట్ కిట్, వాలీబాల్, షటిల్, క్యారమ్స్, స్కిప్పింగ్ సామగ్రితో పాటు చార్జింగ్ స్పీకర్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. తమ పాఠశాల విద్యార్థుల కోసం క్రీడల సామగ్రిని అందించినందుకు సంస్థ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. సంస్థ ప్రతినిధులు భాషా, మధుప్రియ, జగదీశ్‌కుమార్, శివకిశోర్, ఇన్‌చార్జి హెచ్‌ఎం రవీందర్, డాక్టర్ వసంతరాజు పాల్గొన్నారు.



మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



రామచంద్రాపురం: కేటీఆర్‌తో బీఆర్‌ఎస్‌వీ నాయకుడు అఖిల్



సంగారెడ్డి కలెక్టరేట్: మాజీ మంత్రి హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ అంజయ్య

# ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావుకు శుభాకాంక్షలు

నారాయణఖేడ్, జనవరి 2: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

*కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్‌వీ నాయకుడు*


సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 2: మాజీ మంత్రి కేటీఆర్‌ను బీఆర్‌ఎస్‌వీ నాయకుడు అఖిల్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ అందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నాయకులు చైతన్య, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

*హరీశ్‌రావుని కలిసిన మాజీ కార్పొరేటర్*

రామచంద్రాపురం, జనవరి 2: మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుని గురువారం ఆర్సీపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు నర్సింగ్‌రావు, శ్రీరాములు, నర్సింహులు, కుమార్, దాసు తదితరులు ఉన్నారు.

# సమ్మెలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

- కేజీబీవీ, భవిత కేంద్రాల్లో బోధనకు ఆటంకం
- ఎమ్మార్సీ కార్యాలయంలో నిలిచిన సేవలు
- పది, ఇంటర్ విద్యార్థులకు కీలక సమయం
- ఆందోళనలో తల్లిదండ్రులు
- నెల రోజులు కావస్తున్న నిరవధిక సమ్మె




ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం వేసి ఉన్న దృశ్యం

బొల్లారం, జనవరి 2: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల నిరవధిక సమ్మె దాదాపు నెల రోజులుగా కొనసాగుతున్నది. ఉద్యోగులంతా విధులు మానేయడంతో కేజీబీవీ, భవిత కేంద్రాల్లో విద్యాబోధన నిలిచిపోయింది. మండల విద్యాధికారి కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. బోధన, బోధనేతర సిబ్బంది సమ్మెలో ఉండడంతో బోధన, పాలనపరంగా తీవ్ర ప్రభావం పడుతున్నది. విద్యార్థుల చదువులు ముందుకు సాగకపోవడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

*సమ్మెలో 40 మంది ఉద్యోగులు*

సమగ్ర శిక్షా అభియాన్ కింద జిన్నారం మండలంలో దాదాపు 40 మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. కస్తూర్బా విద్యాలయం, భవిత కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలు, ఎంఆర్సీ కార్యాలయం వంటి ఆయా విభాగాల్లో 20 మంది బోధన సిబ్బంది, 20 మంది బోధనేతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో ఎమ్‌ఐఎస్ కోఆర్డినేటర్, సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్, ఏఎన్‌ఎంలు, అకౌంటెంట్లు, వాచ్‌మెన్లు, స్వీపర్లు, మెసెంజర్లు, స్కావెంజర్లుగా ఉన్నారు. వీరంతా 2004 అంటే 20 సంవత్సరాలుగా సమగ్ర శిక్షా అభియాన్‌లో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు.

*సమ్మెతో సేవలకు ఆటంకం*

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవదిక సమ్మెతో మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయంలో సేవలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దాదాపు నెల రోజులుగా ఎటువంటి కార్యకలాపాలు సాగడం లేదు. యూడైస్, మధ్యాహ్న భోజనం వంటి ఆన్‌లైన్ బిల్లుల కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీంతో కార్యాలయం తాళం వేసి కనిపిస్తున్నది. కార్యాలయానికి వచ్చే వారికి అందే సేవల్లో జాప్యం జరుగుతున్నది. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలతోపాటు ఇంటర్ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన ముందుకు సాగడం లేదు. విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో బోధనకు ఆటంకం ఏర్పడింది. ఒకరిద్దరు ఉపాధ్యాయులతో సర్దుబాటు చేసినా ఆశించిన మేర సిలబస్ కావడం లేదు. ప్రభుత్వం టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్ ప్రకటించింది. రెండు రోజుల క్రితం మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క ఉద్యోగుల జేఏసీ సంఘం నాయకులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చే వరకు తమ న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తామని ఉద్యోగులు చెబుతున్నారు.

**ఉద్యోగుల డిమాండ్లు ఇవీ..**

- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలి
- పే స్కేల్ వర్తింపచేయాలి
- రూ.20 లక్షల జీవిత బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి
- ఉద్యోగ విరమణ ప్రయోజనాల కింద రూ.25 లక్షలు చెల్లించాలి
- ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో వెయిటేజీ మార్కులు కేటాయించాలి

## ఇచ్చిన మాటను నిలుపుకోవాలి



ఏండ్లుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నాం. గతంలోనూ సమ్మె చేశాం. మా డిమాండ్లను సీఎం రేవంత్ రెడ్డి నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా నెరవేర్చడం లేదు. హామీ నెరవేర్చి ఇచ్చిన మాటను నిలుపుకోవాలి. లేని పక్షంలో జేఏసీ నాయకుల పిలుపుమేరకు సమ్మెను ఉధృతం చేస్తాం.

*- శైలజ, ఎంఐఎస్ కోఆర్డినేటర్*

## మాకు న్యాయం చేయాలి



అఖిలపక్ష నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులు, మండల విద్యాధికారులు మా దీక్షలకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం పనికి తగ్గ వేతనంతోపాటు మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటన చేస్తే సంతోషంగా విధుల్లో చేరుతాం.

*- శ్రీను, సీఆర్పీ, జిన్నారం*



పద్మశాలీ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

# పద్మశాలీ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 2: పద్మశాలీ సంఘం నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆవిష్కరించారు. గురువారం రాజంపేటలో పద్మశాలీ సంఘం మహిళా విభాగం క్యాలెండర్ విడుదల చేశారు. అనంతరం పద్మశాలి సంఘం జిల్లా కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. పద్మశాలి సంఘం నేతల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు, మహిళా విభాగం నేతలు పాల్గొన్నారు.

# నవోదయ ఏర్పాటుకు గదుల పరిశీలన



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

అందోల్, జనవరి 2: 2025-26 విద్యా సంవత్సరంలో నూతనంగా ప్రారంభించనున్న జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు జోగిపేటలో తాత్కాలిక గదులను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు నూతనంగా నవోదయ విద్యాలయం మంజూరైందని తెలిపారు. ఇందులో భాగంగా తాత్కాలికంగా తరగతులు ప్రారంభిచేందుకు జోగిపేటలోని ప్రాథమిక పాఠశాలలో గదులను పరిశీలించినట్లు తెలిపారు. విద్యాలయం ప్రారంభానికి కొన్ని గదులు అనువుగా ఉన్నాయని, మరికొన్నిటికి మరమ్మతులు చేపడుతామన్నారు. పూర్తి వివరాలు కలెక్టర్‌కు నివేదించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనవెంట ఎంఈవో కృష్ణ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య తదితరులు ఉన్నారు.

# ఫార్మేషన్ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్, జనవరి 2: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు చాంద్‌ఖాన్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఫార్మేషన్ రోడ్డు పనులను గురువారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈరోడ్డు పనులు పూర్తయిన పక్షంలో చాంద్‌ఖాన్‌పల్లి వాసులకు బైపాస్‌రోడ్డు సౌకర్యం ఏర్పడుతుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు ఈరోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్ పాల్గొన్నారు.

# రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలి

**కలెక్టర్ వల్లూరు క్రాంతి**



కలెక్టర్ క్రాంతికి శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 2: నూతన సంవత్సరంలో అధికారులు, ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, ఆయా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన అధికారులు, ఉద్యోగులతో కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది కంటే అధికారులు మెరుగ్గా పని చేయాలని సూచించారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రతినిధుల సమన్వయంతో అధికారులు పని చేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి లలితా కుమారి, వివిధ శాఖల అధికారులు, టీఎన్‌జీవో నాయకులు ఉన్నారు.

# విద్యార్థులకు అల్పాహారం అందజేత



హద్నూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేస్తున్న హెచ్‌ఎం అమృత్

**నమస్తే తెలంగాణ ఎఫెక్ట్**

జహీరాబాద్, జనవరి 2: ప్రత్యేక తరగతులకు హాజరువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఎట్టకేలకు అల్పాహారాన్ని అందించారు. గత నెల 31వ తేదీన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'పస్తులతో ప్రత్యేక తరగతులకు..' కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం జహీరాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు అల్పాహారం అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీకి రూ.52 లక్షలు కేటాయించారు. పాఠశాలలో సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 వరకు ఉండి చదువుకునే విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు రోజు వారీగా అల్పాహారాన్ని అందించే షెడ్యూల్‌ను ప్రకటించారు.

*రోజువారీగా అల్పాహారం వివరాలు*

సోమవారం ఉడికించిన శనగలు, మంగళవారం అటుకుల పోహా, బుధవారం ఉడికించిన బొబ్బర్లు, గురువారం ఉడికించిన పచ్చని బఠానీ, శుక్రవారం ఉప్మా, శనివారం ఉడికించిన పల్లీలు అందించనున్నారు. ప్రత్యేక ప్రణాళిక కింద 52 రోజుల పాటు ఒక్కో విద్యార్థికి రూ.10 వెచ్చించనున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. అల్పాహారం వండి, వడ్డించే బాధ్యతను మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అప్పగించనున్నారు. ఏది ఏమైనా ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు అల్పాహారాన్ని అందించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పటాన్‌చెరు-శంకర్‌పల్లి రహదారి మళ్లింపు

పటాన్‌చెరు, జనవరి 2: పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లికి వెళ్లే రహదారి శంకర్‌పల్లిలో ముస్లింలు జరుపుతున్న ఇస్తెమా(ధార్మిక కార్యక్రమం) కారణంగా రద్దీగా ఉంటుందని ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ సూచించారు. పటాన్‌చెరు మండలం బీడీఎల్ భానూర్ సీఐ గురువారం ప్రకటనలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు శంకర్‌పల్లిలో పటాన్‌చెరు రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో ముస్లింల భారీ ఇస్తెమా ఉండటంతో భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతున్నారన్నారు. భారీగా వాహనాలు వస్తాయని, ట్రాఫిక్ జాం అయ్యే అవకాశం ఉందన్నారు. పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లికి వెళ్లే వాహనాలు కంది నుంచి శంకర్‌పల్లికి, వికారాబాద్, చేవెళ్లకు వెళ్లాలని సూచించారు.

# బీహెచ్‌ఈఎల్ పురోగతికి కృషి చేయాలి

రామచంద్రాపురం, జనవరి 2: బీహెచ్‌ఈఎల్ పరిశ్రమ పురోగతికి భెల్ కార్మికులు కృషి చేయాలని భెల్ ఈడీ కేబీ రాజా అన్నారు. గురువారం భెల్ పరిశ్రమ ఆవరణంలో బీహెచ్‌ఈఎల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భెల్ ఈడీ కేబీ రాజా ఆధ్వర్యంలో భెల్ జెండాను ఆవిష్కరించి భెల్ గీతాన్ని ఆలపించారు. పరిశ్రమ ఎదుగుదలే మన మనుగడకు బాటలు వేస్తుందన్నారు.

# హత్యకేసులో జీవిత ఖైదు

రామచంద్రాపురం, జనవరి 2: హత్య కేసులో నేరస్తుడికి సంగారెడ్డి సెషన్ కోర్టు జీవిత ఖైదు విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించింది. వివరాల్లోకి వెళ్తే.. తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూరు గ్రామానికి చెందిన ఆగని శ్రీనివాస్, వడ్డె శ్రీనివాస్ ఇద్దరు స్నేహితులు. 15 ఫిబ్రవరి 2020 రాత్రి మద్యం సేవిస్తున్న క్రమంలో మాటామాట పెరిగి గొడవ జరిగింది. దీంతో ఆగని శ్రీనివాస్ తన వద్ద ఉన్న కత్తితో వడ్డె శ్రీనివాస్ కడుపులో పొడవడంతో అతను దవాఖానలో ఐదు రోజులపాటు చికిత్స పొంది పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆర్సీపురం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత ఏర్పాటైన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసుకు సంబంధించిన వివరాలను కోర్టుకు సమర్పించారు. వాదోపవాదాలు జరిగిన అనంతరం గురువారం సెషన్ కోర్టు జడ్జి జి.భవానీచంద్ర నేరస్తుడికి రూ.500 జరిమానా, జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ఇన్‌స్పెక్టర్లు రమేశ్, జగదీశ్వర్, రవీందర్, కానిస్టేబుళ్లు నర్సింహులు, గాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి కోర్టుకి సాక్ష్యాలను సమర్పించి నిందితుడికి శిక్ష పడడంలో ముఖ్యపాత్ర పోషించారు.

# కోహీర్‌లో బైక్ చోరీ

కోహీర్, జనవరి 2: కోహీర్ పట్టణంలోని రాచూరి టెక్స్‌టైల్స్ బట్టల దుకాణం వద్ద నిలిపిన తన బైక్ బుధవారం రాత్రి చోరీకి గురైందని వాహనదారుడు నీలి రాజు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనతోపాటు పదకొండు మంది భక్తులు అయ్యప్పమాల ధరించి దుకాణం పైభాగంలో ఉంటున్నామని ఫిర్యాదులో పేర్కొన్నాడు. బైక్ చోరీ విషయం సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. అంతకుముందు ఆర్‌కే ట్రాన్స్‌పోర్టు సమీపంలో బైక్‌ను దొంగిలించేందుకు అతడు యత్నించినా అది స్టార్ట్ కాలేదు. దీంతో అక్కడి నుంచి వచ్చి నీలి రాజుకు చెందిన బైకును దొంగిలించాడు. పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు.

# దిగ్వాల్‌లో ఆటో దగ్ధం

కోహీర్, జనవరి 2: మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆటోను దగ్ధం చేశారు. బాధితుడు కుమ్మరి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దిగ్వాల్ గ్రామానికి చెందిన కుమ్మరి రాజు ఆరు నెలల క్రితం ఆటోను కొనుగోలు చేసి వచ్చే ఆదాయంతో తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం రాత్రి ఇంటి సమీపంలో ఆటోను నిలిపాడు. గురువారం ఉదయం లేచి చూసేసరికి ఆటో దగ్ధం అయినట్లు గుర్తించాడు. డిసెంబర్ 8వ తేదీన కూడా ఇంట్లో నుంచి తులం బంగారం, రూ.50 వేలు చోరీ అయినట్లు చెప్పాడు. దొంగలను పట్టుకొని కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# పరామర్శ.. తక్షణసాయం

కల్హేర్, జనవరి 2: కల్హేర్ తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అరవింద్‌కుమార్ బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు తహసీల్దార్ శివ శ్రీనివాస్ తెలిపారు. టీజీ టీఏ, టీజీ ఆర్ఏఎస్ సంగారెడ్డి శాఖ అధికారులు ఇంటికి వెళ్లి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణసాయంగా రూ.15 వేలు ఆర్థికసాయం అందించారు.

# బోరు మోటరు ప్రారంభం

గుమ్మడిదల, జనవరి 2: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి బుధవారం బోరుతవ్వించిన విషయం తెలిసిందే. గురువారం కొత్త బోరు మోటరు బిగించారు. దీనిని మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ మొగులయ్య, రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, వాసుదేవారెడ్డి, సూర్యనారాయణ స్విచ్ ఆన్ చేసి కొత్త బోరుమోటారు ప్రారంభించారు.